క్లుప్తంగా

నేడు గ్రామసభ

ఇచ్చోడ: ఇచ్చోడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇచ్చోడ అభివృద్ధి కోసం ప్రణాళిక తయారు చేయనున్నట్లు తెలిపారు.

జీవో నంబరు 3పై స్పందించాలి

ఆదిలాబాద్‌రూరల్: జీవో నంబర్ 3పై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు స్పందించాలని మావల మండలం వాఘాపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ నాయకుడు, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ అన్నారు. ఆదివాసీల హక్కు అయిన జీవో నంబర్ 3ను ఎందుకు కాపాడలేక పోతున్నారని ప్రశ్నించారు.

వైద్యులను నియమించాలి

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని బీఎస్పీ జిల్లా నాయకుడు జాడే నాందేవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఉట్నూర్ లేదా ఆదిలాబాద్ రిమ్స్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు నవీన్, తదితరులు ఉన్నారు.

పింఛన్ మంజూరు చేయాలని వినతి



ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన వృద్ధులు

తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ మహిళలు, ఒంటరి మహిళలు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భూమయ్యకు వినతిపత్రం అందజేశారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా.. రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజవ్వ, లక్ష్మీ, సవిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కొకటి గణేష్ అనే విద్యార్థి బ్లాడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ. 21,515 నగదు జమ చేసి, విద్యార్థి తండ్రి స్వామికి సోమవారం ఎంపీపీ గండ్రత్ రమేష్ చేతుల మీదుగా అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్ గంట రాములు, ఉపసర్పంచ్ జయంత్, పాఠశాల ప్రధానపాధ్యాయుడు ముజాఫర్ హుస్సేన్, గ్రామస్తులు కాంతారావు, ఆనంద్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

నేరడిగొండ: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎల్‌పీవో ధర్మరాణి అన్నారు. సోమవారం మండలంలోని బొందిడి గ్రామంలో పర్యటించారు. గత నెల 30న డీపీవో శ్రీనివాస్‌కు గ్రామ పంచాయతీని తెరవడం లేదని, గ్రామంలో అభివృద్ధి కుంటుపడుతుందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వడూర్ గ్రామ పంచాయతీని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఎంపీవో శోభన, సర్పంచ్ అడే అనిత జనార్దన్, పంచాయతీ కార్యదర్శి రజిత పాల్గొన్నారు.

ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

నేరడిగొండ: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ నాగేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. సైబర్‌క్రైం, డ్రంక్ అండ్ డ్రైవ్, ఫోక్సో, చైల్డ్ లేబర్ చట్టాల గురించి వివరించారు. దాబా హోటళ్లలో సిట్టింగ్‌లు చేయకుండా చర్యలు చేపడుతామని, గంజాయి స్మగ్లింగ్ నివారణ కోసం కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఇచ్చోడ సీఐ నైలు, నేరడిగొండ ఎస్సై సాయన్న, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

తలమడుగు: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ (సీజీఆర్ఎఫ్) ఈశ్వరయ్య అన్నారు. మండల కేంద్రంలో సబ్‌స్టేషన్‌లో సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. రైతులు, బాధితులు విద్యుత్ సమస్యలను విన్నవించారు. వాటిని పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్యం

- భీంపూర్ పీహెచ్‌సీకి పెరుగుతున్న రోగుల సంఖ్య
- అందుబాటులో అన్ని రకాల వైద్య సేవలు



చికిత్స పొందుతున్న రోగులు



భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రజలు వైద్య సేవలు అందుతున్నాయి. అన్ని రకాల వసతులు కల్పించడంతో పీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గతంలో 50 నుంచి 100 వరకు ఓపీ ఉండగా.. ప్రస్తుతం 200 మందికి పైగా రోగులు వస్తున్నారు. రోగులతో వైద్య సిబ్బంది మర్యాదగా వ్యవహరిస్తూ.. వైద్యం అందిస్తున్నారు. బీపీ, షుగర్ దీర్ఘకాలిక వ్యాధులతో పాటు రక్త, మూత్ర పరీక్షలు చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

6 నెలల్లో 107 ప్రసవాలు..

ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో వైద్య సిబ్బంది గ్రామాల్లోని గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నారు. దీని ఫలితంగా భీంపూర్ పీహెచ్‌సీలో ఆరు నెలల వ్యవధిలో 107 సాధారణ ప్రసవాలు చేశారు. నార్మల్ డెలివరీలకు సిబ్బంది పాధాన్యం ఇస్తుండడంతో మండలంలోని పలు గ్రామాల గర్భిణులతో పాటు మహారాష్ట్రకు చెందిన వారు కూడా భీంపూర్ మండల కేంద్రానికి వస్తున్నారు. ప్రతీ నెల స్కానింగ్, రక్తహీనత, బీపీ పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేస్తున్నారు. వైద్యులతో పాటు సరిపడా సిబ్బంది ఉండడంతో సకాలంలో వైద్యసేవలు అందుతున్నాయి.

వైద్య సేవలకు గుర్తింపు..

జిల్లాకు సరిహద్దున ఉన్న మారుమూల ప్రాంతంలో ఉన్న భీంపూర్ ఆరోగ్య కేంద్రం ద్వారా అందిస్తున్న వైద్యసేవలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఆరోగ్య కేంద్ర వైద్య బృందం నాలుగు నెలల క్రితం భీంపూర్ పీహెచ్‌సీని సందర్శించారు. వసతులు, వైద్యసేవలను పరిశీలించారు. మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న పీహెచ్‌సీగా గుర్తించి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఏఎస్) ఎంపిక చేశారు. గతంలోనూ భీంపూర్ ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలకు కాయకల్ప అవార్డుకు ఎంపికైంది. వసతులతో పాటు మెరుగైన వైద్యం అందుతుందనే భరోసాతో అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం



ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నాం. ప్రత్యేక ల్యాబ్‌లో రక్త, మూత్ర పరీక్షలు నిర్వహిస్తున్నాం. నార్మల్ డెలివరీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తామనే భరోసా కల్పిస్తున్నాం.

– విజయసారథి, వైద్యాధికారి, భీంపూర్

అవగాహన కల్పించాం



రోగులకు అన్ని రకాల వైద్య సేవలపై అవగాహన కల్పించాం. దీంతో ప్రజలు ఆరోగ్య కేంద్రంలోని వైద్య సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. మొదట ప్రజల్లోని అపోహలను పోగొట్టడడంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. అవసరమైన పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నాం.

– జ్ఞానేశ్వర్, ఆరోగ్య విస్తీర్ణధికారి, భీంపూర్

'బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఇచ్చోడ: బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బోథ్ అసెంబ్లీ ప్రభారి కొంగ సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శక్తి కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతీ కార్యకర్త పార్టీ బలోపేతం కోసం సైనికుడిలా పని చేయాలన్నారు. అమలు కాని హామీలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి సూర్యకాంత్ గిత్తె, కేంద్రే నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: అమలు కాని హామీలతో సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేశారని బీజేపీ బోథ్ అసెంబ్లీ ప్రభారి సత్యనారాయణ ఆరోపించారు. సోమవారం మండలంలోని గిరిగాంలో బీజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి, సాకటి దశరథ్, సూర్యకాంత్, ప్రవీణ్, రామారావు, సుభాష్, గంగాధర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పాయల్ శంకర్

కైలాసనగర్: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాహుల్ రాజ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా పరిపాలన వ్యవహారాల్లో తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఆయన వెంట నాయకుఉ లాలా మున్నా, దినేష్ మటోలియ, జ్యోతి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

'కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం'

ఎదులాపురం: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. ప్రజావ్యతిరేక బడ్జెట్ ప్రవేశ పెట్టడాన్ని, స్టాక్స్ కుంభకోణంపై విచారణ చేయించాలని సోమవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ముడుపు నళినిరెడ్డి, సిర్ర దేవేందర్, కుంటాల రాములు, మెస్రం భాస్కర్, కేశవ్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మున్నూరుకాపు కులస్తులు

ఆదిలాబాద్‌రూరల్: ఇల్లు లేని నిరుపేద మున్నూరు కాపు కుటుంబాలకు ఆదిలాబాద్ రూరల్ మండల మాజీ జెడ్పీటీసీ కొండ గంగాధర్ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులు సోమవారం మండలంలోని యాపల్‌గూడలో మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు పరిశీలించారు. కొండ గంగాధర్ మాట్లాడుతూ.. ఇంటి స్థలం ఉండి ఇంటి నిర్మాణం చేసుకోలేని పేద మున్నూరుకాపు కులస్తులకు దాతల సాయంతో ఇంటిని నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. పనుల పురోగతి ఎలా ఉందో పరిశీలించడం జరిగిందన్నారు. ఆయన వెంట బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఈఈ ఆరె దశరథ్, మునిగెల గంగన్న, భాస్కర్, అరిగెల కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

సిరికొండ: మండలంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సోమవారం తహసీల్దార్ సర్ఫారాజ్ నవాజ్‌కు ప్రెస్‌క్లబ్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దత్తు మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులను గుర్తించి, ఇళ్ల స్థలాలు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో మండల జర్నలిస్టులు పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీకాంత్

తాంసి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంఈవో శ్రీకాంత్ అన్నారు. సోమవారం భీంపూర్ మండల కేంద్రంలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల నిర్వహణ కమిటీ, పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. అందరి సహకారంతో పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి సుజాత్‌ఖాన్, సీడీపీవో రాజేంద్రప్రసాద్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ తిరుపతి, మహిత పోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మోటార్లు తొలగించాలని ధర్నా

బోథ్: పెద్ద వాగులో మోటార్లు తొలగించాలని పొచ్చెర గ్రామానికి చెందిన రైతులు సోమవారం కోరమాండల్ వద్ద ధర్నా నిర్వహించారు. మోటార్లు పెట్టడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించి మోటార్లను తీసి వేయించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వచ్చి రైతులను సముదాయించడంతో శాంతించారు.

సంస్కృతిని కాపాడాలి

బోథ్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఆదివాసీలు తీర్మానాలు చేశారు. సోమవారం మండలంలోని పార్డి(బి) రాయిసెంటర్ పరిధిలో ఆదివాసీలు సమావేశమయ్యారు. ఈసందర్భంగా పలు తీర్మానాలు చేశారు. బొడ్డెమ్మ, సీమంతం ఆదివాసీల సాంప్రదాయానికి విరుద్ధమన్నారు. పెళ్లిలు చేసుకుంటే కట్నాలు తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో సార్‌మెడి తొడసం లక్ష్మణ్, ఉప సార్‌మెడి లాలూరాం, రాయ్ పటేల్, ఇస్రు, ఐటీడీఏ డైరెక్టర్ భూమన్న, ఆత్రం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కోర్టు భవనం నిర్మించాలని వినతి

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రంలో జూనియర్ కోర్టు భవనాన్ని నిర్మించాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టులో పోర్టు పోలియో జడ్జి మమ్మినేని సుధీర్‌కుమార్, హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ రిజిస్ట్రార్ రమాకాంత్‌లను సోమవారం కలిసి విన్నవించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు వామన్ రావ్, సెక్రటరీ శంకర్, న్యాయవాదులు ఆడెపు హరీష్ పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల హోంగార్డుగా ఉద్యోగ విరమణ పొందిన మండలంలోని చాందా (టి) గ్రామానికి చెందిన అశోక్‌ను గ్రామానికి చెందిన పోలీసులు సోమవారం ఘనంగా సన్మానించారు. సిబ్బంది లంక విఠల్, గౌర దేవిదాస్, చిలక రవి, చిందం దేవిదాస్, లింబన్న, సంతోష్, గండ్రత్ సంతోష్, రాకేష్, ఇండ్ల రాజు, మహేందర్ పాల్గొన్నారు.

'గిరిజనులపై కక్ష కట్టిన ప్రభుత్వం'

సిరికొండ: ఎస్టీ జాబితాలో రాష్ట్రంలోని 11 కులాలను చేర్చేందుకు తీర్మానం చేసి కేంద్రా ప్రభుత్వానికి పంపించడం సరికాదని తుడుందెబ్బ నాయకులు అన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్టీ జాబితాలో ఇతర కులాలను చేర్చడం కక్ష సాధింపు చర్య అన్నారు. కార్యక్రమంలో చిత్రు పాల్గొన్నారు.

రవీందర్ సింగ్‌ను కలిసిన భూమారెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్: రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్‌ను రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.

బీసీ సంఘం కార్యనిర్వహక కార్యదర్శిగా శ్రీనివాస్

తాంసి: జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వహక కార్యదర్శిగా తాంసి మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు ఆధ్వర్యంలో ఎనుకున్నారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన జిల్లా కార్యవర్గానికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రేమికుల రోజును బహిష్కరించాలి

బోథ్: ప్రేమికుల రోజును బహిష్కరించాలని టీజీవీపీ ఆధ్వర్యంలో సోమవారం ప్రేమికుల దినోత్సవ ప్రతులను బస్టాండ్ వద్ద దహనం చేశారు. లవ్ జిహాద్ పేరుతో హిందూ అమ్మాయిలను ట్రాప్ చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు అవునూరి శ్రీనివాస్, అశోక్, అన్వేష్, వినయ్, అజయ్, స్వామి, రవితేజ, ఆకాష్, నవీన్ పాల్గొన్నారు.

దేశ ద్రోహులను కఠినంగా శిక్షించాలి



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నేరడిగొండ: దేశ ద్రోహులను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్, మాదిగ యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాయన్నకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి దేశ ద్రోహుల కారణంగా రాష్ట్రంలో, దేశంలో విద్వేషాలు చెలరేగి దేశ భద్రతకు విఘాతం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గాజుల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. తుప్ప పడుతున్న కుక్కర్స్



నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది. వంటలు చేసేందుకు స్టీమ్ కుక్కర్స్ సరఫరా చేశారు. కానీ వాటిని వినియోగించకపోవడంతో తుప్ప పట్టి పోతున్నాయి. ఐటీడీఏ అధికారులు స్పందించి స్టీమ్ కుక్కర్‌లు పని చేసేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: దిలిప్‌కుమార్, ఐటీడీఏ డీడీ ఉట్నూర్, ఫోన్: 89851 50449

పేదలకు వరం 'కల్యాణలక్ష్మి'

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: కల్యాణలక్ష్మి పేదలకు వరమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంతో పాటు వడగామ్, అందునాయక్‌తండా గ్రామాలను సందర్శించి 74 కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆడపిల్లల పెళ్లిలకు ఇబ్బంది పడకుండా సీఎం కేసీఆర్ ఈపథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్‌లు కోరెంగా గాంధారి, జాదవ్ లక్కన్, ఆత్రం రత్తుబాయి పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ లోన్ యూనిట్లు పెంచాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మైనార్టీ కార్పొరేషన్ లోన్ యూనిట్లు పెంచాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావ్ డిమాండ్ చేశారు. సోమవారం మైనార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలం వ్యాప్తంగా మూడు యూనిట్లు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కనీసం దరఖాస్తు చేసుకున్న వారికి 50 యూనిట్ల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్ ఫారిక్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గాయక్‌వాడ్ దిలిప్, పవార్ దుదిరాం, ఫేక్ అంజద్, సూర్యవంశీ, మధుకర్ పాల్గొన్నారు.

భూమిపూజ

బేల: మండలంలోని మశాల(కె) రెవెన్యూ గ్రామ శివారులోని జంగుబాయి ఆలయం పరిసరాల్లో సోమవారం ఐటీడీఏ నిధులు రూ.10లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్‌లు రం చందర్ షావు, అడ శంకర్‌లు భూమిపూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ సుధాకర్, ఆదివాసీ నాయకులు పెందూర్ మోహన్, సిడాం నందకుమార్, ఆత్రం ఫక్రు, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు పెంచాలి

ఆదిలాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీకి నర్సరీని ఏర్పాటు చేసుకొని మొక్కలు పెంచాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని పొచ్చర, దిమ్మ గ్రామాల్లో ఆయన పర్యటించారు. నర్సరీలతో పాటు శ్మశాన వాటిక, డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలన పెంచి సంరక్షించాలన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ఆయన వెంట ఎంపీవో ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

- కిడ్నీలు ఫెయిల్ అయి.. మంచానికే పరిమితం
- వైద్యం అందక నరకయాతన



మంచానికే పరిమితమైన నైతం బాబారావ్

జైనథ్: జైనథ్ మండలంలోని ఆకోలి గ్రామానికి చెందిన నైతం బాబారావ్ ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. చిన్న వయస్సులోనే పెళ్లి కావడంతో కూలీ పనులు చేసుకుంటూ.. భార్య అర్చన, ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఉన్నదాంట్లో సర్దుకుపోతూ.. జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. కానీ బాబారావ్‌ను విధి కాటేసింది. రెండు కిడ్నీలు ఫెయిల్ కావడంతో గత కొంత కాలంగా నరకయాతన అనుభవిస్తున్నాడు. ప్రభుత్వ ఆసుపత్రుల చుట్టూ తిరిగిన మెరుగైన చికిత్స అందకపోవడంతో గత నెల రోజులుగా మంచానికే పరిమితమయ్యాడు. ప్రైవేట్‌లో చూయించుకునే స్థోమత లేక ఇంటి వద్దనే ఉంటూ.. ఆపన్నహస్తం కోసం దీనంగా ఎదురుచూస్తున్నాడు. దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటున్నాడు.

బాధితుడి ఫోన్‌పే, గూగుల్ పే నంబర్: 99599 21116, నైతం భాస్కర్

ప్రణాళికాబద్ధంగా చదవాలి

ఎదులాపురం: ప్రణాళికాబద్ధంగా చదివితే పదో తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారి శ్రీకాంత్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ గెజిటెడ్ 1 పాఠశాల విద్యార్థులకు పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికతో చదవాలన్నారు. అర్థం కాని విషయాలను సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలాదేవి, ఉపాధ్యాయులు, పొగాకు నియంత్రణ విభాగం సామాజిక కార్యకర్త చిరంజీవి పాల్గొన్నారు.